ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను
అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.
ఉదయం
సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 197 | పేజీలు: 6 | వెల: రూ.3/- | శనివారం 24 అక్టోబర్ 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి



### భారతీయ సంస్కృతే
# మన అస్తిత్వానికి మూలం
### ప్రధాని నరేంద్ర మోడీ

**న్యూఢిల్లీ, అక్టోబర్ 23 (ప్రభాత ఉదయం)**

భారత్ మంటపంలో నిర్వహించిన 'చిన్మయ అమృత మహోత్సవ్' గ్లోబల్ సమ్మేళనాన్ని ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించి ప్రసంగించారు. భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక వైభవాల విశిష్టతను కొనియాడిన ఆయన, మన దేశం సంస్కృతికి జన్మభూమి అని, మన అస్తిత్వానికి మూలస్తంభమని పునరుద్ఘాటించారు. దేశం స్వాతంత్ర్యం పొంది 75 ఏళ్లు పూర్తయిన సందర్భంలో, వికసిత భారత్ లక్ష్యానికి ఆత్మనూ, వేల సంవత్సరాల మహోన్నతమైన సాంస్కృతిక స్ఫూర్తినీ జోడించడమే తమ ఉద్దేశమని ప్రధాని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 1993లో వడోదరాలో స్వామి చిన్మయానందతో జరిగిన తన చివరి భేటీ జ్ఞాపకాలను ప్రధాని మోడీ నెమరువేసుకున్నారు. సమ్మేళనంలో ఆధునిక హోలోగ్రాఫిక్ సాంకేతికత ..మిగతా 2లో

### రేవంత్ రెడ్డి ప్రభుత్వ హడావిడి
# కొద్దిరోజులు మాత్రమే
### త్వరలో కేసీఆర్ సీఎం అవుతారని కేటీఆర్ ధీమా

**హైదరాబాద్, అక్టోబర్ 23 (ప్రభాత ఉదయం)**



దేశ రాజకీయాల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కీలక పాత్ర పోషించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని, ఆయన జాతీయ స్థాయిలో చక్రం తిప్పే సమయం ఆసన్నమైందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వ హడావిడి కొద్దిరోజులు మాత్రమేనని, ఆ తర్వాత మళ్లీ కేసీఆరే ముఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమా ..మిగతా 2లో

# వచ్చే పది నెలలు అత్యంత ప్రమాదకరమైన పరిస్థితి రాబోతోంది

### రిజర్వాయర్లలో 20 శాతం నీరు లేదు, ఇప్పుడున్న పరిస్థితుల్లో సాగుకు విద్యుత్తు ఇవ్వలేం :

### 100కు పైగా దేశాలలో ఎల్‌నినో ప్రభావం



**ప్రజల భాగస్వామ్యంతోనే ఎల్‌నినోను ఎదుర్కోగలం**

**కరెంట్ విషయంలో పొదుపు మంత్రం పాటించాలి**

**కెసిఆర్ ను నమ్మి కరోనాను లెక్కచేయక అనేకమంది చనిపోయారు**

**కరోనా విపత్తులో ప్రధాని మోడీ ఏం చెబితే దేశ ప్రజలు అదే చేసి సహకరించారు**

**ఏసీల వాడకాన్ని తగ్గించి సోలార్ విద్యుత్ ను ప్రోత్సహించాలి**

**హైదరాబాద్, అక్టోబర్ 23 (ప్రభాత ఉదయం)**

వచ్చే నాలుగు నెలలు సాగుకు చుక్కనీరు కూడా దొరికే అవకాశాలు లేవని సీఎం రేవంత్ రెడ్డి రైతులకు సూచించారు. తాగునీటి అవసరాలు తీర్చుకోవడం తప్ప వేరే గత్యంతరం లేదన్నారు. ఇది క్యాన్సర్‌లాంటి నిజమని ముందే ప్రజలకు చెప్పడం మంచిదని అన్నారు. వచ్చే పది నెలలు అత్యంత ప్రమాదకరమైన పరిస్థితి రాబోతోందని అన్నారు. ఎల్‌నినో వల్ల కరవు పరిస్థితులపై ప్రజలకు సరిగ్గా వివరించకపోతే తాము రాజకీయంగా దెబ్బతింటామని తేల్చి చెప్పారు. వాస్తవాలు చెప్పకపోతే బీఆర్ఎస్ నేతల చేసే ప్రచారాన్నే జనం నమ్ముతారని అన్నారు. తాగడానికే నీళ్లు దొరకని పరిస్థితుల్లో ఇక వ్యవసాయానికి నీళ్లు ఇవ్వలేమన్నారు. యాసంగి పంటలను వేయొద్దని తెలంగాణ రైతాంగాన్ని కోరారు. ఏసీల వాడకాన్ని ప్రజలు తగ్గించుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. గడ్డుకాలం రాబోతున్న పరిస్థితుల్లో ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. పశు సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. బీఆర్ఎస్ దుష్ప్రచారాన్ని ఎండగట్టే ఓపిక తమ నేతలకు ఉండట్లేదని ఆక్షేపించారు. ఎక్కువ ధర పెట్టి కొందామన్నా విద్యుత్ దొరకట్లేదన్నారు. కరెంట్ విషయంలో పొదుపు మంత్రం పాటించాలని ప్రజలకు సూచించారు. ప్రభుత్వ ఆఫీసుల్లో పగలు లైట్లు, ఫ్యాన్లు వేయొద్దని కోరారు. రిజర్వాయర్లలో 20 శాతం నీరు లేదు. ప్రస్తుతం సాగు నీరే లేనప్పుడు వ్యవసాయానికి విద్యుత్ ఇవ్వడం అసాధ్యమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రిజర్వాయర్లలో 20 శాతం కూడా నీటి నిల్వలు లేవన్న ఆయన కృష్ణా జలాల్లో 200 టీఎంసీలు కూడా లేవని చెప్పారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. రాబోయే 8 నుంచి 10 నెలలు కరవును ఎదుర్కోవాలన్నారు. కరవుపై 6 నెలల నుంచి ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. మూడు నెలల క్రితం ఎల్‌నినో ప్రభావం పెద్దగా లేకపోవడంతో వానాకాలం పంటల నుంచి బయటపడ్డామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ ఏడాది 20 వేల మెగావాట్లకు పైగా విద్యుత్ వినియోగం జరిగిందని అన్నారు. కరవుపై 6 నెలల నుంచి ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్న ఆయన ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు అని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రాజకీయ దురుద్దేశంతో బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆక్షేపించారు. 100కు పైగా దేశాలపై ఎల్‌నినో ..మిగతా 2లో



### తెలంగాణలో నేరాలు
# తగ్గుముఖం
### సదరన్ రీజినల్ పోలీస్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, అక్టోబర్ 23 (ప్రభాత ఉదయం)**

హైదరాబాద్‌లోని ఐసీసీసీ వద్ద జరిగిన సదరన్ రీజినల్ పోలీస్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. తెలంగాణలో పోలీసుశాఖలో అనేక సంస్కరణలు తెచ్చామని తెలిపారు. పోలీసుశాఖలో అనేక సంస్కరణలు తెచ్చామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దక్షిణాది రాష్ట్రాల డీజీపీలు, దర్యాప్తు సంస్థల సమన్వయ సమావేశానికి హాజరైన రేవంత్ రెడ్డి, రాష్ట్రంలో చేపట్టిన చర్యలను వివరించారు. మంచి సమాజం కోసం పోలీసుశాఖలో సంస్కరణలు అవసరమని అభిప్రాయం వ్యక్తం చేశారు. హైడ్రా, ఈగల్, టీజీ సేఫ్ ఏర్పాటు చేశామని, నార్కోటిక్స్ నియంత్రణకు అనేక చర్యలు తీసుకున్నామన్నారు. రాష్ట్రాన్ని నక్సల్స్ ఫ్రీ తెలంగాణగా మార్చామన్నారు. సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు కేంద్ర హోంశాఖ అవార్డులు ఇచ్చిందని గుర్తు చేశారు.

**సమన్వయంతో పనిచేసి నేరాలు అరికట్టాలి**

హైదరాబాద్ ట్రాఫిక్ నిర్వహణలో వివిధ విభాగాలు పనిచేస్తున్నాయన్న సీఎం రేవంత్‌రెడ్డి, ప్రాణాలను పణంగా పెట్టి మరీ శాంతిభద్రతలను పోలీసులు రక్షిస్తున్నారని ప్రశంసించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను ఆదుకుంటున్నామని, వారి పిల్లలకు నాణ్యమైన విద్య అందిస్తున్నామని ..మిగతా 2లో

# కార్మికుల ప్రాణాలకు భద్రతేది?

**పరిశ్రమల భద్రతపై ప్రభుత్వ నిర్లక్ష్యమెందుకు?... గడ్డపోతారం సరాక రసాయన పరిశ్రమలో గ్యాస్ లీకేజీ.. ఇద్దరు కార్మికుల మృతి**

**సిగాచి ఘటన నుండి గుణపాఠం నేర్చుకోవడంలో రేవంత్ ప్రభుత్వం వైఫల్యం.**

**మృతుల కుటుంబాలకు అండగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**ఒక్కో కుటుంబానికి రూ.70 లక్షల పరిహారం.. అంత్యక్రియల కోసం లక్ష రూపాయల ఆర్థిక సహాయం... క్షతగాత్రులకు మెరుగైన వైద్యం**








**పటాన్ చెరు, అక్టోబర్ 23(ప్రభాత ఉదయం):**

గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని సరాక పరిశ్రమలో గ్యాస్ లీకేజీ ఘటనలో ఇద్దరు కార్మికులు దుర్మరణం చెందిన ఘటన చోటుచేసుకోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని పటాన్చెరువు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. కార్మికుల ప్రాణాలకు భరోసా కల్పించాల్సిన పరిశ్రమల యాజమాన్యాలు పర్యవేక్షించాల్సిన ప్రభుత్వ యంత్రాంగం బాధ్యతాయుతంగా వ్యవహరించడం లేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సరాక పరిశ్రమ గ్యాస్ లీకేజీ ఘటనలో మృతి చెందిన ఇద్దరు కార్మికుల కుటుంబాలకు యాజమాన్యంతో చర్చించి 70 లక్షల రూపాయల నష్టపరిహారంతో పాటు అంత్యక్రియల కోసం లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. ఘటనలో గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని సంబంధిత యాజమాన్యాన్ని ఆదేశించారు. సమాచారం అందుకున్న వెంటనే ఘటన స్థలానికి వెళ్లిన ఎమ్మెల్యే ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. పరిశ్రమ యాజమాన్యంతో పాటు వివిధ శాఖల అధికారులతో మాట్లాడి ఘటన వివరాలు తెలుసుకున్నారు. ఘటన పైన పూర్తి స్థాయి విచారణ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పటాన్ చెరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వెళ్లి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. స్థానిక శాసనసభ్యుడిగా కుటుంబాలకు సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పారిశ్రామిక అభివృద్ధికి పటాన్ చెరు ప్రాంతం కీలక కేంద్రంగా ఎదుగుతున్నప్పటికీ పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. పరిశ్రమల అభివృద్ధి అంటే కేవలం ఉత్పత్తి, లాభాల పెరుగుదల మాత్రమే కాదని అక్కడ పనిచేసే ప్రతి కార్మికుడి ప్రాణానికి భరోసా కల్పించడం కూడా అంతే ముఖ్యమని అన్నారు. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు సక్రమంగా అమలవుతున్నాయా? ప్రమాదాలను ముందుగానే గుర్తించే వ్యవస్థలు పనిచేస్తున్నాయా? గ్యాస్ లీకేజీలను నివారించే రక్షణ చర్యలు తీసుకుంటున్నారా? అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే ఏర్పాట్లు ఉన్నాయా? అనే అంశాలపై సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.

**ప్రమాదాలపై సమగ్ర విచారణ జరిపించాలి**

సరాక పరిశ్రమలో గ్యాస్ లీకేజీకి దారితీసిన కారణాలను వెలికితీయాలని, ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. భద్రతా లోపాలు ఏమైనా ఉన్నట్లయితే వాటిని గుర్తించి, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. పారిశ్రామిక ప్రాంతాల్లోని అన్ని పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

సిగాచి ఘటన నుంచి తగిన గుణపాఠాలు నేర్చుకుని కార్మికుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని, వరుస పారిశ్రామిక ప్రమాదాలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని విడనాడాలని విమర్శించారు.

**కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటాం**

ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలను ఆదుకోవడంతో పాటు, బాధితులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్మికుల భద్రత విషయంలో పరిశ్రమల యాజమాన్యాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రభుత్వ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.




### ఏపీ పురపాలిక ఎన్నికల
# బరిలో మజ్లిస్
### రెండు కార్పొరేషన్లు, ఐదు మున్సిపాలిటీల్లో 21 మంది పోటీ

**హైదరాబాద్, అక్టోబర్ 23 (ప్రభాత ఉదయం)**

హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ పురపాలక ఎన్నికల్లో గెలిచేందుకు మజ్లిస్ పార్టీ ముమ్మరంగా ప్రచారం చేస్తోంది. కడప కార్పొరేషన్ మేయర్, హిందూపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్ స్థానాలకు మజ్లిస్ పార్టీ అభ్యర్థులు నామినేషన్లు సమర్పించారు. విజయవాడ, కడప కార్పొరేషన్లతోపాటు ఐదు మున్సిపాలిటీల్లో ఆ పార్టీకి చెందిన 21మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను బరిలో దింపితే కచ్చితంగా గెలుస్తామని ఏపీకి చెందిన కొందరు మజ్లిస్ నేతలు ఇటీవల హైదరాబాద్‌కు వచ్చి ఆ పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీని కలిసి వివరించారు. అన్ని మున్సిపాలిటీల్లో కాకుండా.. కచ్చితంగా గెలుస్తామన్న వార్డులు, డివిజన్లలో మాత్రమే పోటీ చేద్దామని ఒవైసీ సూచించగా వారు అంగీకరించారు. కడప కార్పొరేషన్ మేయర్ పదవికి, విజయవాడ కార్పొరేషన్‌లో మూడు డివిజన్లకు అభ్యర్థులను ఎంపిక చేశారు. హిందూపురం మున్సిపాలిటీలో ఛైర్‌పర్సన్ అభ్యర్థితోపాటు ఐదు వార్డుల్లో పోటీ చేస్తున్నారు. ఆదోని-7, రాయదుర్గం-3, నంద్యాల, పెనుగొండ మున్సిపాలిటీల్లో ఒక్కో వార్డులో బరిలో దిగారు. తమ పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు హైదరాబాద్ నుంచి మజ్లిస్ ఎమ్మెల్యేలు జాఫర్ హుస్సేన్ మిరాజ్, మహ్మద్ ముబీన్, మాజిద్ హుస్సేన్, ఎమ్మెల్సీ రియాజ్ ఉల్ హసన్ ఎఫెండీలు ఇప్పటికే ప్రచారం నిర్వహించారు.

# నవంబర్ 1 నుంచి గ్రీన్ వాటర్ ట్యాంకర్ సేవలకు సన్నాహాలు

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రత్యేక కార్యాచరణ**

**నిర్మాణ రంగం, పరిశ్రమలు, పార్కులు, గ్రీనరీ అవసరాలకు శుద్ధి చేసిన నీరు**

**భూగర్భ జలాల పరిరక్షణ, తాగునీటి వనరులపై ఒత్తిడి తగ్గించడమే లక్ష్యం**

**ట్యాంకర్లకు ప్రత్యేక బ్రాండింగ్, జీపీఎస్.. ఫిల్లింగ్ స్టేషన్లలో ఈ-పోస్ యంత్రాలు**

**బుకింగ్ నుంచి డెలివరీ వరకు పర్యవేక్షణకు ప్రత్యేక ఆన్‌లైన్ వేదిక**

**నవంబర్ 1 నాటికి ఏర్పాట్లు పూర్తి చేయాలి: జలమండలి ఎండీ కె. అశోక్ రెడ్డి**

**హైదరాబాద్, అక్టోబర్ 23(ప్రభాత ఉదయం)**




రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు భూగర్భ జలాల పరిరక్షణతో పాటు తాగునీటి వనరులపై ఒత్తిడిని తగ్గించేందుకు జలమండలి ప్రత్యేక కార్యాచరణ చేపడుతోంది. ఇందులో భాగంగా మురుగునీటి శుద్ధి కేంద్రాల్లో (ఎస్టీపీలు) శుద్ధి చేసిన నీటిని నిర్మాణ రంగం, పరిశ్రమలు, పార్కులు, గ్రీనరీ, ఇతర తాగునీరు అవసరం లేని పనులకు వినియోగించేలా నవంబర్ 1 నుంచి గ్రీన్ వాటర్ ట్యాంకర్ సేవలను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది.

రానున్న ఎల్-నినో పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ నీటి వనరుల వినియోగాన్ని పెంచేందుకు చేపడుతున్న చర్యలపై శుక్రవారం జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్షించారు. గ్రీన్ వాటర్ సేవలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ట్యాంకర్ల నమోదు, ఫిల్లింగ్ స్టేషన్లు, ఆన్‌లైన్ బుకింగ్ వ్యవస్థల ఏర్పాట్లను వేగవంతం చేయాలని ఆదేశించారు.

**డిమాండ్‌కు అనుగుణంగా ఫిల్లింగ్ స్టేషన్లు**

నిర్మాణ రంగం, పరిశ్రమలు, వాణిజ్య సముదాయాలు, ప్రభుత్వ సంస్థలు, గేటెడ్ కమ్యూనిటీల్లో శుద్ధి చేసిన నీటికి ఉన్న డిమాండ్‌ను ప్రాంతాలవారీగా అంచనా వేయాలని ఎండీ సూచించారు. అందుకు అనుగుణంగా సమీపంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఎస్టీపీలను గుర్తించి గ్రీన్ వాటర్ ఫిల్లింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఫిల్లింగ్ పాయింట్లు, ప్లాట్‌ఫారాలు, పంపింగ్ సదుపాయాలు, ఫ్లో మీటర్లు, ఇతర మౌలిక వసతులను సమకూర్చాలని పేర్కొన్నారు.

**ట్యాంకర్లకు ప్రత్యేక బ్రాండింగ్.. జీపీఎస్ తప్పనిసరి:**

గ్రీన్ వాటర్ సరఫరాలో పారదర్శకత ఉండేలా ప్రతి ట్యాంకర్‌కు ప్రత్యేక బ్రాండింగ్‌తో పాటు జీపీఎస్ పరికరాన్ని తప్పనిసరిగా అమర్చాలని ఎండీ ఆదేశించారు. ట్యాంకర్ల కదలికలు, సరఫరా సమయాలు, డెలివరీ వివరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.

ప్రతి ఫిల్లింగ్ స్టేషన్‌లో ఈ-పోస్ యంత్రాలను ఏర్పాటు చేసి, ట్యాంకర్లలో నింపే నీటి పరిమాణం, బుకింగ్, సరఫరా వివరాలను డిజిటల్ విధానంలో నమోదు చేయాలని స్పష్టం చేశారు.

**బుకింగ్ నుంచి డెలివరీ వరకు ఆన్‌లైన్ పర్యవేక్షణ:**

గ్రీన్ వాటర్ ట్యాంకర్ల నమోదు, వినియోగదారుల రిజిస్ట్రేషన్, ఆన్‌లైన్ బుకింగ్, ట్యాంకర్ కేటాయింపు, జీపీఎస్ ట్రాకింగ్, డిజిటల్ చెల్లింపులు, డెలివరీ నిర్ధారణ వంటి సేవలన్నీ ఒకే వేదికపై అందుబాటులో ఉండేలా ప్రత్యేక మొబైల్ యాప్‌ను సిద్ధం చేయాలని ఎండీ సూచించారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

**ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో భద్రతా చర్యలు చేపట్టాలి -- జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 23 (ప్రభాత ఉదయం)**

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ప్రజల్లో అవగాహన పెంపొందించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ కె. కిరణ్మయి తెలిపారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాలు, భద్రతా ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమగ్రంగా సమీక్షించారు. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాల వివరాలను పరిశీలించి, ప్రమాదాల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్, మున్సిపల్, జాతీయ రహదారులు, రోడ్లు భవనాల శాఖ, రవాణా, ట్రాఫిక్, ఆర్టీసీ తదితర శాఖల అధికారులు




సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి, అక్కడ అవసరమైన రహదారి భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ సక్రమంగా పనిచేసేలా ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని, అవసరమైన చోట అదనపు భద్రతా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన పనులను గుర్తించి ప్రతిపాదనలు సమర్పిస్తే, నిబంధనల మేరకు అనుమతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలకు అతివేగం, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం ప్రధాన కారణాలని ఆమె తెలిపారు. వాహనదారులు అనుమతించిన వేగ పరిమితిలోనే వాహనాలు నడపాలని, రాంగ్ రూట్‌లో ప్రయాణించడం, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. రక్షణాత్మక డ్రైవింగ్ (డిఫెన్సివ్ డ్రైవింగ్) అలవర్చుకోవాలని, వాహనం నడిపేటప్పుడు పరిసరాలను గమనిస్తూ అప్రమత్తంగా ఉండటం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. రోడ్డు భద్రతపై పాఠశాల విద్యార్థులు, కళాశాల యువతకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. పాదచారులు రోడ్డు దాటేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని, వాహనదారులు పాదచారుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ ఏడాది జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకొని, ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలని సూచించారు. రంగారెడ్డి జిల్లాను రోడ్డు ప్రమాదాలు లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమిష్టిగా కృషి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో రోడ్లు భవనాల శాఖ, రవాణా శాఖ, జాతీయ రహదారుల శాఖ, పోలీస్, ట్రాఫిక్, ఆర్టీసీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## భారతీయ సంస్కృతే మన అస్తిత్వానికి మూలం

మొదటి పేజీ తరువాయి...

ద్వారా స్వామీజీ రూపాన్ని సందర్శించడం, మాట్లాడటం తనకు 33 ఏళ్ల నాటి అనుభవాలను, ఆయన ఆప్యాయతను, ఆశీస్సులను మళ్లీ ప్రత్యక్షం చేసినట్లు ఉందన్నారు. నాటి భేటీలో యువశక్తిని సద్వినియోగం చేస్తూ బలమైన, సమర్థవంతమైన భారతదేశాన్ని నిర్మించడమే ప్రధాన చర్చాంశమని గుర్తుచేశారు. ఆ సమావేశం జరిగిన కొద్ది సంవత్సరాలకే గుజరాత్ ముఖ్యమంత్రిగా సేవ చేసే అవకాశం ప్రజలు తనకు ప్రసాదించారని, నాటి నుంచి నేటి వరకు గత 25 ఏళ్లుగా ప్రభుత్వ అధినేతగా దేశానికి శక్త్యానుసారం సేవ చేస్తున్నానని ప్రధాని తెలిపారు. ఈ సుదీర్ఘ సేవా ప్రయాణంలో గురుదేవుల ఆశీస్సులు నిరంతరం తనతోనే ఉన్నాయని మోడీ స్పష్టం చేశారు.

## రేవంత్ రెడ్డి ప్రభుత్వ హడావిడి కొద్దిరోజులు మాత్రమే

మొదటి పేజీ తరువాయి...

వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన అంబర్‌పేట నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య నేతల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని కేటీఆర్ ఆరోపించారు. తీవ్రమైన విద్యుత్ కోతల వల్ల రైతులు అల్లాడుతున్నారని, వారి కష్టాలను పట్టించుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. ఎల్‌నినో ప్రభా వంపై నిపుణులు పది నెలల ముందే హెచ్చరించినప్పటికీ, ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టడంలో విఫలమైందని మండిపడ్డారు. కాంగ్రెస్ హామీలను నమ్మి మోసపోయిన అన్ని వర్గాల ప్రజలు ఇప్పుడు మళ్లీ బీఆర్ఎస్ వైపే చూస్తున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి హడావిడి మరికొద్దిరోజులు మాత్రమే ఉంటుందని కేటీఆర్ పేర్కొన్నారు. జాతీయ రాజకీయాల గురించి ప్రస్తావిస్తూ, భవిష్యత్తులో కాంగ్రెస్, బీజేపీయేతర పార్టీలే దేశంలో నిర్ణయాత్మక పాత్ర పోషిస్తాయని కేటీఆర్ జోస్యం చెప్పారు. రాహుల్ గాంధీ ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆశించిన ఫలితం ఉండదని, అటు ప్రధాని మోదీ పాలనలోనూ దేశానికి చేకూరిన ప్రయోజనం ఏమీ లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం తెలంగాణ నుంచి గెలిచిన ఎంపీలెవరూ పార్లమెంటులో గళం విప్పడం లేదని ఆయన దుయ్యబట్టారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు యువత తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యాల వల్లే నేడు యువత రోడ్లపైకి వచ్చి పోరాటాలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతలు రాష్ట్ర అభివృద్ధిని విస్మరించి, కేవలం ప్రతిపక్షాలను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని ఆయన ఆరోపించారు.

## వచ్చే పది నెలలు అత్యంత ప్రమాదకరమైన పరిస్థితి రాబోతోంది

మొదటి పేజీ తరువాయి...

ప్రభావం ఉందన్న ఆయన మహారాష్ట్ర లాంటి అభివృద్ధి చెందిన రాష్ట్రంలో కూడా నీటి ఎద్దడి ఉందని గుర్తుచేశారు. మహారాష్ట్రలో 20 శాతం తక్కువ నీటిని వాడాలని నిర్ణయించారని తెలిపారు. మరో 8 నెలల పాటు ఎండల తీవ్రతగా ఉంటుందని చెప్పారు. ఎండల తీవ్రతకు ఇళ్ల నుంచి బయటకు వచ్చే పరిస్థితి ఉండదని హెచ్చరించారు. ప్రజల భాగస్వామ్యం లేకుండా కరవును ఎదుర్కోలేమని స్పష్టం చేశారు. అంతకుముందు హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో కాంగ్రెస్ నేతల సమావేశం జరిగింది. ఎల్‌నినో ప్రభావం, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులు, కీలక నేతలు పాల్గొన్నారు. 2 గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలను కైవసం చేసుకునేలా సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు.

## తెలంగాణలో నేరాలు తగ్గుముఖం

మొదటి పేజీ తరువాయి...



చెప్పారు. తాము తీసుకున్న చర్యలతో రాష్ట్రంలో నేరాలు తగ్గుముఖం పట్టాయని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. దక్షిణాది రాష్ట్రాలు మరింత సమన్వయంతో పనిచేసి నేరాలను అరికట్టాలని కోరారు. సురక్షితమైన దక్షిణ భారతం కోసం మనమంతా కలిసి పనిచేయాలన్నారు.

**పౌరుల భద్రత కోసం పోలీస్‌శాఖపై ఖర్చు**

ఈ సదస్సు ద్వారా పోలీసు విభాగాల మెరుగైన సమన్వయానికి అవకాశం లభిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. దక్షిణాది రాష్ట్రాల పరస్పర సహకారంతో నేరాలు పూర్తిగా అరికట్టడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించవచ్చని తెలిపారు. హైదరాబాద్‌ను 4 కమిషనరేట్లుగా విభజించి అత్యుత్తమ సేవలు అందిస్తున్నామన్నారు. నార్కోటిక్స్, సైబర్ నేరాల కట్టడికి కఠిన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పోలీసు సిబ్బంది భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామన్న సీఎం రేవంత్‌రెడ్డి. సమాజానికి భద్రత, రక్షణ అనేవి పునాదులు వంటివన్నారు. సమర్థ, నిష్పక్షపాత పోలీసు వ్యవస్థనే ప్రజలు కోరుకుంటారని తెలిపారు.

పోలీసింగ్ విధానాలు మారాలి, సంస్కరణలు నిరంతరం కొనసాగాలని అభిలషించారు. పోలీసుశాఖపై పెట్టే ఖర్చును పౌరుల భద్రతకు పెట్టుబడిగా భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

“పోలీసింగ్ విధానాలు మారాలి. సంస్కరణలు నిరంతరం కొనసాగాలి. నేను సంస్కరణలను నమ్ముతాను. పోలీసుశాఖపై పెట్టే ఖర్చును పౌరుల భద్రతకు పెట్టుబడిగా భావిస్తున్నాం. ఆహార కల్తీ నివారణకు టీజీ సేఫ్, ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేందుకు హైడ్రా ఏర్పాటు చేశాం. ప్రస్తుతం సైబర్ సెక్యూరిటీ, నార్కోటిక్స్, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ చాలా ముఖ్యమైన విభాగాలు. మా సంస్కరణలు మంచి ఫలితాలిచ్చాయి. సైబర్ నేరాలను అరికట్టడంలో మన సెక్యూరిటీ బ్యూరో దేశంలో మొదటి స్థానంలో నిలిచింది. దీంతో ఈ విభాగానికి కేంద్రం నుంచి అవార్డు లభించింది. పోలీసుల పిల్లల కోసం యంగ్ ఇండియా పోలీస్ స్కూల్స్ తీసుకొచ్చాం” – రేవంత్‌రెడ్డి, ముఖ్యమంత్రి

**అప్పుడు ఆక్టోపస్ ఇప్పుడు ఈగల్ ఫోర్స్**

నక్సల్స్‌ను ఎదుర్కొనేందుకు 1980ల్లో గ్రేహౌండ్స్ ఏర్పాటు చేశారని, మన విభాగానికి దేశవ్యాప్తంగా మంచి పేరుందని సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. గతంలో హైదరాబాద్‌లో బాంబు పేలుళ్లు జరిగాయన్నారు. ఇలాంటి తీవ్రవాద కార్యకలాపాలు అరికట్టేందుకు ఆక్టోపస్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మత్తుపదార్థాల నియంత్రణ కోసం ఇప్పుడు ఈగల్ ఫోర్స్ ఏర్పాటు చేశామన్న ఆయన డ్రగ్స్ ముఠాలను పట్టుకునేందుకు అనేక ఆపరేషన్లు చేశామన్నారు. ఇటీవల జీరో నక్సల్ స్టేట్‌గా తెలంగాణ మారిందని డీజీపీ ఆనంద్ తెలిపారు. 824 మంది నక్సల్స్ లొంగిపోయారని, 302 ఆయుధాలు అప్పగించారన్నారు.

**గంజాయి రవాణాపై దృష్టి సారింపు**

ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ ద్వారా ప్రకృతి విపత్తుల్లో సమర్థంగా సేవలు అందిస్తున్నామని డీజీపీ ఆనంద్ చెప్పారు. పోలీసులు ఉపయోగించే యాప్స్‌ను టీస్పార్క్ పేరుతో అప్‌డేట్ చేశామని వెల్లడించారు. మహిళల భద్రతకు ప్రత్యేక విభాగం పనిచేస్తోందన్న డీజీపీ వారి భద్రత కోసం టీసేఫ్ యాప్ రూపొందించామని తెలిపారు. రాష్ట్రంలో తీవ్రవాద కార్యకలాపాలు బాగా తగ్గాయని తెలిపారు. నేరాలు తగ్గుముఖం పట్టేలా వివిధ రకాల చర్యలు తీసుకున్నామన్నారు. 2023లో యాంటీ నార్కోటిక్స్ విభాగం ఏర్పాటు చేశామని, దీంతో ఎప్పటికప్పుడు మాదక ద్రవ్యాల ముఠాలను పట్టుకుంటున్నామన్నారు. విదేశాలకు వెళ్లి మరీ డ్రగ్స్ ముఠాలను సైతం అరెస్టు చేస్తున్నట్లు డీజీపీ వెల్లడించారు. ప్రస్తుతం గంజాయి రవాణా పెరుగుతోందని దానిపై దృష్టి పెట్టినట్లు డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు.



## ఎల్ నినో, నీటి కొరతతో జిల్లాలో పడిపోయిన సాగు విస్తీర్ణం

**అడుగంటిన ప్రాజెక్టులు, ఎండిపోతున్న పంటలపై ఆందోళనలో అన్నదాతలు**

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 23 ( ప్రభాత ఉదయం)**

జోగుళాంబ గద్వాల జిల్లాలో ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోయింది. జిల్లా వ్యాప్తంగా సాధారణ సాగు విస్తీర్ణం 3.40 లక్షల ఎకరాలు ఉండాల్సి ఉండగా, ఈ యేడాది కేవలం 2,73,317 ఎకరాలలో మాత్రమే సాగు నమోదైంది. వాతావరణ మార్పుల కారణంగా సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గడం పట్ల రైతు లోకం ఆందోళన వ్యక్తం చేస్తోంది. వర్షాలు లేక ఈ యేడాది ప్రాజెక్టులు , రిజర్వాయర్లలో తగినంత నీటి మట్టం లేకపోవడంతో సాగునీటి విడుదల నిలిచిపోయింది. కాలువల ద్వారా నీరందకపోవడం, దానికి తోడు తరచూ ఏర్పడుతున్న విద్యుత్ కోతల వల్ల బోరు బావులపై ఆధారపడిన పంటలు కూడా పొట్టదశలోనే ఎండిపోయాయి.

జిల్లాలో ఈ యేడాది
ప్రత్తి 1,67,110 ఎకరాలు
వరి 76,224 ఎకరాలు సాగు చేశారు.
కంది (గ్రాఅస్త్రవశీఅగ్రాము): 14,983 ఎకరాలు
ఇతర పంటలు: 15,000 ఎకరాలు

**లేట్‌గా ప్రారంభం కానున్న వరి కోతలు -- కొనుగోలు కేంద్రాలపై దృష్టి సారించాలి**

రుతుపవనాల అనిశ్చితి, వర్షాల జాప్యం వల్ల ఈసారి సాగు ఆలస్యంగా ప్రారంభమైంది. దీనిఫలితంగా వరి కోతలు కూడా ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత ఏడాది జిల్లా వ్యాప్తంగా 72 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల నుంచి వడ్లను సేకరించారు. ఈ ఏడాది కూడా పంట కోతల సమయానికి తగినన్ని కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తెచ్చి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

**ఇంకా కొనుగోళ్లు ప్రారంభించని సర్కారు**

జిల్లాలో ఖరీఫ్‌లో 255 గ్రామపంచాయతీలు, 72 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడానికి పౌరసరఫరాల శాఖ ద్వారా సర్కార్ సన్నద్ధమైంది. ఇందుకోసం యాక్షన్ ప్లాన్ కూడా సిద్ధం చేసింది. అక్టోబరు చివరి వారంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడానికి నిర్ణయించినా జిల్లాలో ఇప్పటివరకు కేంద్రాలు ప్రారంభం కాలేదు. కృష్ణా నదీ పరివాహ ప్రాంతాలలో కోతలు ప్రారంభమయ్యాయి. దీంతో కర్ణాటకకు చెందిన ప్రైవేట్ వ్యాపారులు, మిల్లర్లకు రైతులు ధాన్యం విక్రయిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో సన్న వడ్లు క్వింటాలు రూ.4100 వరకు కొనుగోలు చేస్తుండగా.. అర్ అండ్ అర్ సన్న వడ్లు రూ.,3800 నుంచి రూ.4200 వరకు చెల్లిస్తున్నారు. ప్రభుత్వం యాసంగిలో క్రాప్ హాలిడేగా ప్రకటిస్తారని ఊహిస్తున్న క్రమంలో ధాన్యం లభించే అవకాశాలు తక్కువ కానున్నాయని భావించి పచ్చి పచ్చి వడ్లు కొనుగోలు చేస్తున్నారు.



బాధితులతో కలిసి శేరిలింగంపల్లి ఏసీపీకి వినతి పత్రం అందిస్తున్న బిజెపి నాయకులు రవికుమార్ యాదవ్, గంగాధర్ రెడ్డి.

## రోడ్డు విస్తరణతో పేదల పొట్టకొట్టొద్దు!

**నానక్‌రామ్‌గూడ చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించాలి**

**అధికారులకు బీజేపీ నేతలు రవికుమార్ యాదవ్, గంగాధర్ రెడ్డి వినతి**

**శేరిలింగంపల్లి , అక్టోబర్ 23,(ప్రభాత ఉదయం)**

నగర అభివృద్ధి పేరుతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టడం అవసరమే అయినప్పటికీ ఆ పనుల కారణంగా రెక్కాడితే గానీ డొక్కాడని చిరు వ్యాపారుల జీవనోపాధి దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ రవికుమార్ యాదవ్, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి కోరారు. నానక్‌రామ్‌గూడలో రోడ్డు విస్తరణ కారణంగా ఉపాధి కోల్పోతున్న చిరు వ్యాపారులకు వెంటనే ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. నానక్‌రామ్ గూడలో రోడ్డు విస్తరణ పనులతో తోపుడు బండ్లపై పండ్లు, కూరగాయలు, టిఫిన్లు విక్రయిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్న పలువురు చిరు వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక అసిస్టెంట్ టౌన్ ప్లానింగ్ అధికారికి రవికుమార్ యాదవ్, గంగాధర్ రెడ్డి బాధిత వ్యాపారులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోజువారీ వ్యాపారంపై ఆధారపడి జీవించే పేద కుటుంబాలకు ఉపాధి కోల్పోవడం తీవ్ర ఆర్థిక భారంగా మారుతుందని పేర్కొన్నారు. కుటుంబ పోషణతో పాటు పిల్లల చదువులు, ఇంటి అద్దెలు, ఇతర నిత్యావసర ఖర్చులు భరించడం కష్టమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి పనుల వల్ల చిరు వ్యాపారులు రోడ్డున పడే పరిస్థితి రాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

ట్రాఫిక్‌కు ఆటంకం కలగని అభ్యంతరాలు లేని అనువైన ప్రాంతాలను గుర్తించి బాధిత చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయంగా కేటాయించాలని వారు కోరారు. ముందుగా వ్యాపారుల వివరాలను సేకరించి, వారి ఉపాధికి భరోసా కల్పించేలా ప్రణాళిక రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. రోడ్ల అభివృద్ధి ఎంత ముఖ్యమో పేద కుటుంబాల జీవనోపాధిని కాపాడటం కూడా అంతే ముఖ్యమని పేర్కొంటూ అధికారులు మానవతా దృక్పథంతో స్పందించి తక్షణ పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు శివా సింగ్, బీజేపీ నాయకులు మీన్ లాల్ సింగ్, శేఖర్, శ్రీశైలం, బన్సీ లాల్ సింగ్, సోహన్ లాల్, మునావర్, కవిత భాయ్, మోహన్ లాల్, సంపత్, రాజ్ కుమార్, శ్రీను, రాజు, యాదయ్యతో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, బాధిత చిరు వ్యాపారులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి, బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీమంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి లను కలిసిన పోరెడ్డి ధర్మారెడ్డి

### రాజేంద్రనగర్,అత్తాపూర్ సర్కిళ్ల అభివృద్ధి,ప్రజా సమస్యలపై చర్చ...బీఆర్ఎస్ నాయకులతో కలిసి పండుగ శుభాకాంక్షలు.

**రాజేంద్రనగర్,అక్టోబర్23(ప్రభాత ఉదయం)**

దసరా పండుగను పురస్కరించుకుని రాజేంద్రనగర్,అత్తాపూర్ సర్కిళ్ల ఇన్‌చార్జి పోరెడ్డి ధర్మారెడ్డి బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా పండుగ విశిష్టతను ప్రస్తావిస్తూ ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు,ఆరోగ్యం,శాంతి,సమృద్ధి వెల్లివిరియాలని ఆకాంక్షించారు.అనంతరం రాజేంద్రనగర్,అత్తాపూర్ సర్కిళ్ల పరిధిలోని పలు అంశాలపై కేటీఆర్‌తో చర్చించారు.స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు,ప్రాంత అభివృద్ధికి సంబంధించిన అంశాలపై పార్టీ నాయకులు పరస్పరం అభిప్రాయాలు



పంచుకున్నారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు.తదుపరి మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే,మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కూడా పోరెడ్డి ధర్మారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు.విజయదశమి పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తుందని,ప్రజల మధ్య ఐక్యత,సోదరభావం,సామరస్యం మరింత బలపడాలని



ఎన్టీఆర్ కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బి ఆర్ ఎస్ నాయకులు ధర్మారెడ్డి

ఆకాంక్షించారు.పండుగలు ప్రజలను ఒకచోట చేర్చి పరస్పర ఆత్మీయతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు ప్రజలతో మమేకమై స్థానిక సమస్యలపై నిరంతరం స్పందిస్తూ ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా చర్చించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎర్రోళ్ల యాదన్న,లక్ష్మిరాజ్,సరికొండ దుర్గేష్,రవీందర్ యాదవ్,అకిరా నందన్ పాల్గొన్నారు.



ఆత్మ హత్య చేసుకున్న రోహిత్ రెడ్డి

# అమెరికా వీసా ఆందోళనలో యువకుడి ఆత్మహత్య

**బుద్వేల్, అక్టోబరు 23 (ప్రభాత ఉదయం)**

అమెరికా లో చదువుకోవడానికి వీసా వస్తుందో... రాదో ... అనే అపోహతో ఓ యువకుడు ఇంట్లోని తన గదిలో ప్యాన్కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన శుక్రవారం అత్తాపూర్ తేజస్వీని నగర్ కాలనీ లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఈ విదంగా ఉన్నాయి... తేజస్వీనగర్ కాలనీ కి చెందిన చంద్రారెడ్డి, ఇందిర ల కుమారుడు రోహిత్ రెడ్డి (26) అమెరికా లో చదువుకోవడానికి గతంలో ఒక సారి వీసా కోసం ప్రయత్నిం చగా నిరాకరణ కు గురయ్యాడు. రెండో సారి వీసా కోసం ప్రయత్నిస్తున్నాడు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు తెలిపారు. తనకు వీసా వస్తుందో రాదోనని పలుమార్లు ఆందోళన కు గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఇంట్లో తన గది లో ప్యాన్ కు ఉరి వేసుకుని ఆతహ్మత్యకు పాల్పడ్డాడు. వీసా రాదేమోనని భయందోళన కు గురై ఆత్మహత్య చేసుకుని ఉంటాడని కుటుంబ సభ్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న అత్తాపూర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు లో ఉంది.



# మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డికి దసరా శుభాకాంక్షలు తెలిపిన మాజీ కౌన్సిలర్ కోరని దయానంద్(డేవిడ్)

**రాజేంద్రనగర్,అక్టోబర్23(ప్రభాత ఉదయం)**

రాజేంద్రనగర్ నియోజకవర్గం సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ కోరని దయానంద్(డేవిడ్)తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఇరువురి మధ్య ఆత్మీయ పలకరింపు చోటుచేసుకుంది.విజయదశమి పండుగ ప్రజల జీవితాల్లో కొత్త ఆశలు,ఆనందాలు నింపాలని,ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా, సుభిక్షంగా ఉండాలని కోరాని దయానంద్ ఆకాంక్షించారు.దసరా పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తుందని,ప్రజల మధ్య ఐక్యత,సోదరభావం,సామరస్యం మరింత బలపడేందుకు ఇలాంటి పండుగలు దోహదపడతా యని పేర్కొన్నారు.ప్రజలందరూ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకుంటూ పరస్పర ప్రేమాభిమానాలను పంచుకోవాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా పట్నం మహేందర్‌రెడ్డికి పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ,రానున్న రోజులు ప్రజలకు శు భప్రదంగా ఉండాలని

### నేడు మైలార్ దేవుపల్లి విద్యుత్ సెక్షన్ పరిధిలో

# సరఫరాలో అంతరాయం ఉండే ప్రాంతాలు



**రాజేంద్రనగర్, అక్టోబర్ 23(ప్రభాత ఉదయం)**

మైలార్ దేవుపల్లి విద్యుత్ సెక్షన్ పరిధిలో శనివారం విరిగిన స్తంభాలను మార్చుడం కోసం సరఫరాల అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు. సెక్షన్ పరిధిలోని పల్లెచెరువు విద్యుత్ ఫీడర్ లో ఉదయం 10.30 నుండి 11 గంటల వరకు హరిజన్ బస్తీ, అయేషా కాలనీ, తమిళ బస్తీ , పారిశ్రామిక ప్రాంతం, రీగల్ గార్డెన్ ఫీడర్ పరిధిలో ఉదయం 11:30 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు సుభాన్ కాలనీ, ఇండల్ ఏరియా, మిలన్ కాలనీ, అన్మోల్ గార్డెన్ వెనుక భాగం, జహంగీరాబాద్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12.30 నుండి 1:30 వరకు క్రిస్టల్ టౌన్, జహంగీరాబాద్, మిలత్ నగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఇతర సమస్యలపై ఈ మొబైల్ 8712470085 కు ఫోన్ చేయాలని ఆయన కోరారు.

# అక్రమ బాణాసంచా తయారీ, నిల్వ, విక్రయ స్థావరాలపై దాడులు - ముగ్గురు అరెస్ట్

**బుద్వేల్, అక్టోబరు 23 (ప్రభాత ఉదయం)**

ప్రజా భద్రతను పరిరక్షించడంలో బాగంగా, అగ్ని ప్రమాదాలను నివారించడానికి రాజేంద్రనగర్ టాస్క్ ఫోర్స్ బృందం, హైదరాబాద్ సిటీ, అత్తాపూర్, మైలార్దేవుపల్లి పోలీస్ స్టేషన్ల లా అండ్ ఆర్డర్ పోలీసులు కలిసి ఉమ్మడి గా బుధ, గురువారాలలో సోదాలు నిర్వహించారు. అత్తాపూర్, మైలార్దేవుపల్లి పోలీసు స్టేషన్ల పరిధిలోని రెండు వేర్వేరు ప్రాం తాలలో ఈ దాడులను నిర్వహించారు. ఎలాంటి లైసెన్సులు లేకుండ, అగ్ని మాపక భద్రత ప్రమాణాలు పాటించకుండ, చట్టవిరుద్ధంగా బాణసంచా తయారు చేస్తు, నిల్వ ఉంచి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేశారు.

**జలాల్ బాబా నగర్ లో..**

బుధ, గురువారాలలో జలాల్ బాబా నగర్ లో నౌనెంబరు వద్ద ఉన్న జరీనా సుల్తాన నివాసంపై డాడులు చేశారు. ఇక్కడ ఎలాంటి నిబంధనలు పాటించకుండ బాణసంచా తయారు చేస్తున్నట్లు గుర్తిం చారు. జరీనా సుల్తానా (60), మహ్మద్ అజార్ (36) లను ఆరెస్ట్ చేశారు. వారి నుంచి నాలుగు బస్తాల లూజ్ బాణాసంచా, బాణాసంచ మసాల పొడి 500 గ్రాములు, పొటాషియం పౌడర్ 500 గ్రాములు స్వాధీనం చేసుకున్నారు.

**బాబుల్ రెడ్డి నగర్ శక్తి ట్రేడర్స్ లో...**

మైలార్దేవుపల్లి బాబుల్ రెడ్డి నగర్ శక్తి ట్రేడర్స్ హోల్ సేల్ బాణా సంచా దుకాణంపై దాడులు నిర్వహిం చారు. ఇక్కడ అక్రమంగా బాణసంచా నిల్వ ఉంచి విక్రయిస్తున్నట్లు కనుగొన్నారు. ఈ సంఘటన లో ఉప్పర్ పల్లి నివాసి హాఫీజ్ మేఘాని (46)ని అరెస్ట్ చేశారు. అతని నుంచి 7 కార్టన్



స్వాధీనం చేసుకున్న బాణా సంచ

పెట్టెల బీడీ బాం బులు, ఆరు కార్టెన్ల పాత్‌అప్స్, మూడు కాటన్ వండర్ క్రాకర్స్ లు స్వాధీనం చేసుకున్నారు. ప్రజల భద్రత కోసమే ఈ దాడులు చేస్తున్నట్లు తెలిపారు. ఎక్కడైన బాణసంచా తయారీ, అక్రమ నిల్వ, విక్రయాలు జరుగుతున్నట్లు తెలిస్తే 112 కు డయల్ చేయాలని టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు.



స్వాధీనం చేసుకున్న బాణా సంచ

# అర్హులైన పట్టభద్రులు నవంబర్ 6లోపు దరఖాస్తు చేసుకోవాలి

### కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్

**రాజేంద్రనగర్,అక్టోబర్23(ప్రభాత ఉదయం)**



రానున్న తెలంగాణ శాసన మండలి పట్టభద్రుల ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హులైన ప్రతి ఒక్క పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ విజ్ఞప్తి చేశారు.రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్లలో ఉన్న పట్టభద్రులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ...ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని,అర్హులైన పట్టభద్రులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.తెలంగాణ శాసన మండలి పట్టభద్రుల ఎన్నికల్లో భాగస్వాములు కావాలంటే ముందుగా ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలిపారు.

**నవంబర్ 6లోపు నమోదు చేసుకోవాలి..**

గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ పూర్తి చేసిన పట్టభద్రులు,2023 నవంబర్ 1వ తేదీకి ముందు గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన వారు ఓటరు నమోదుకు అర్హులని తెలిపారు.అర్హులు అధికారిక దరఖాస్తు ఫారం-18ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.నమోదుకు చివరి తేదీ 2026 నవంబర్ 6అని పేర్కొన్నారు.

**అవసరమైన పత్రాలు..**

ఓటరు గుర్తింపు కార్డు,ఆధార్ కార్డు,డిగ్రీ లేదా గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్,పాస్‌పోర్ట్ సైజు ఫొటో,మొబైల్ నంబర్‌తో పాటు అవసరమైన పత్రాలను సిద్ధం చేసుకుని నమోదు ప్రక్రియను పూర్తిచేయాలని వెంకటేష్ కోరారు.అర్హులైన పట్టభద్రులు ఈ విషయాన్ని గుర్తించి గడువులోగా ఓటరుగా నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# బీజేపీ మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా మేకల వనితారెడ్డి

**రాజేంద్రనగర్,అక్టోబర్23(ప్రభాత ఉదయం)**



బీజేపీ మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా మేకల వనితారెడ్డి నియమితులయ్యారు.ఈ మేరకు బిజెపి మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పడమటి మమతారెడ్డి నియామక ఉ త్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా వనితరెడ్డి మాట్లాడుతూ...కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు,అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల ముందుకు తీసుకెళ్లి పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడానికి శక్తివంతం లేకుండా కృషి చేస్తామన్నారు.ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేశానన్నారు.మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి,రాష్ట్ర,జిల్లా నాయకత్వానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ జిల్లాలో పెద్ద సంఖ్యలో మహిళలను బీజేపీతో అనుసంధానం చేసి మహిళా మోర్చాను మరింత బలోపేతం చేస్తానన్నారు.మహిళల సమస్యలు, హక్కులు,భద్రత,సాధికారత కోసం నిరంతరం కృషి చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు.పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి కార్యకర్తలతో కలిసి జిల్లాలో బీజేపీని మరింత బలోపేతం చేయడమే తన లక్ష్యమని మేకల వనితారెడ్డి పేర్కొన్నారు.

# పట్టభద్రుల బిఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలి

### బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కోలన్ సుభాష్‌రెడ్డి

**రాజేంద్రనగర్,అక్టోబర్23(ప్రభాత ఉదయం)**



మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు కోసం పార్టీ శ్రేణులు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కోలన్ సుభాష్‌రెడ్డి పిలుపునిచ్చారు .హైదర్‌గూడలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియ సన్నాహక సమావేశంలో పార్టీ ముఖ్య నాయకులతో ఆయన చర్చించారు.ఈ సందర్భంగా కోలన్ సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ... రాజేంద్రనగర్,అత్తాపూర్ సర్కిళ్ల పరిధిలోని ప్రతి డివిజన్‌లో అర్హులైన పట్టభద్రులందరినీ గుర్తించి ఓటరుగా నమోదు చేయించే బాధ్యతను పార్టీ నాయకులు, కార్యకర్తలు తీసుకోవాలని సూచించారు.ఒక్క పట్టభద్రుడు కూడా ఓటరు నమోదుకు దూరంగా ఉండకూడదని,ప్రతి డివిజన్‌లో ప్రత్యేక దృష్టి సారించి నమోదు ప్రక్రియను విస్తృతంగా చేపట్టాలని కోరారు.నవంబర్ 6ఓటరు నమోదు ప్రక్రియకు చివరి తేదీ కావడంతో అర్హులైన పట్టభద్రులు చివరి రోజు వరకు వేచి చూడకుండా ముందుగానే తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు.ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైనదని,పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలంటే ముందుగా ఓటరుగా నమోదు కావడం అవసరమని పేర్కొన్నారు.పార్టీ నాయకులు,కార్యకర్తలు తమ పరిధిలోని కాలనీలు,బస్తీలు,డివిజన్లలో పట్టభద్రులను సంప్రదించి ఓటరు నమోదు ప్రాధాన్యతను వివరించాలని తెలిపారు.అలాగే ముద్రణ,ప్రసార మాధ్యమాల ప్రతినిధులు కూడా తమ వార్తలు,ప్రచార కార్యక్రమాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించాలని కోలన్ సుభాష్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.రాజేంద్రనగర్,అత్తాపూర్ సర్కిళ్ల పరిధిలోని అర్హులైన పట్టభద్రులందరికీ ఓటరు నమోదు గడువు,అవసరమైన ప్రక్రియపై సమాచారం చేరవేయడంలో మీడియా కీలక పాత్ర పోషించాలని కోరారు.పట్టభద్రులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఓటరుగా నమోదు కావాలని,ప్రజాస్వామ్య ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

**ప్రమాద ప్రాంతాల్లో భద్రతా ప్రమాణాలను మెరుగుపరచాలి**

**రహదారి భద్రతపై కలెక్టర్, ఎస్పీ ప్రత్యేక దృష్టి**

**జీరో ఫటాలిటీ డిస్ట్రిక్ట్ కార్యక్రమాన్ని సంయుక్తంగా పరిశీలించిన కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్**





**పటాన్ చెరు,అక్టోబర్ 23( ప్రభాత ఉదయం):**

జిల్లాలో రోడ్డు ప్రమాదాలు, ప్రమాద మరణాలను తగ్గించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు, సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా రహదారి భద్రతా ప్రమాణాలను మెరుగుపరచాలని సూచించారు. ప్రమాద రహిత ( జీరో ఫటాలిటీ డిస్ట్రిక్ట్ - జెడ్ ఎఫ్ డి) కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జాతీయ రహదారి 65పై పటాన్‌చెరు నుంచి దిగ్వాల్ కూడలి వరకు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్ , అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, అదనపు కలెక్టర్ పాండు, జాతీయ రహదారులు, రహదారులు--భవనాలు, పోలీసు, రవాణా శాఖల అధికారులతో కలిసి పటాన్‌చెరు నుంచి జహీరాబాద్ మార్గంలో ప్రమాదాలు అధికంగా జరిగే ప్రమాద స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో రహదారి భద్రతా ప్రమాణాలను మెరుగుపరిచి, ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలను ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో ఎత్తైన విద్యుద్దీపాలు, హెచ్చరిక సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పటాన్చెరువు బస్టాప్ ప్రాంతంలో పాదచారుల వంతెన ఏర్పాటు చేయాలని, కంది చౌరస్తా వద్ద రహదారి అంచులను సూచించే గుర్తులు ఏర్పాటు చేసి, రహదారి స్పష్టంగా కనిపించేలా విద్యుద్దీపాల సదుపాయం కల్పించాలని సూచించారు. పోతిరెడ్డి పల్లి చౌరస్తా వద్ద రాకపోకల రద్దీని తగ్గించడంతో పాటు, బస్సుల నుంచి దిగే ప్రయాణికులు సురక్షితంగా రాకపోకలు సాగించేలా తగిన ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. రహదారిపై వాహనాల వేగాన్ని తగ్గించే రంబుల్ స్టిక్స్ ,స్పీడ్ బ్రేక్స్ ,వాహనాల వేగాన్ని గుర్తించే పరికరాలను ఏర్పాటు చేయడంతో పాటు, ప్రమాదకర మలుపులు, ఇరుకైన రహదారుల వద్ద ముందస్తు హెచ్చరికలు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రహదారి పై వాహనాల అధిక వేగాన్ని నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రమాద రహిత జిల్లా లక్ష్యంగా సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్, సూచించారు.రాకపోకల నియంత్రణ, వాహనదారుల్లో రహదారి భద్రతపై అవగాహన పెంపు, అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గుర్తించిన లోపాలను త్వరితగతిన పరిష్కరించి, చేపట్టిన చర్యలపై సమగ్ర నివేదికలు సమర్పించాలని బాధ్యతాయుత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి లలితా దేవి, రహదారులు--భవనాల శాఖ కార్యనిర్వాహక ఇంజినీరు శ్రీనివాస్, ఉప కార్యనిర్వాహక ఇంజినీరు రవీందర్, డి టి ఓ వాసు, ఏ ఎమ్ వి ఐ గౌతమ్, సంగారెడ్డి, పటాన్‌చెరు ఉప పోలీసు అధికారుల బృందాల అధికారులు, జాతీయ రహదారుల ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ఎనిమిదేళ్ల తర్వాత హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు.. రూ.20 వేల జరిమానా

**శేరిలింగంపల్లి అక్టోబర్ 23, (ప్రభాత ఉదయం)**



కట్టుకున్న భార్యపై అనుమానం.. నిత్యం గొడవలు.. చివరకు నిద్రిస్తున్న భార్య గొంతుకోసి కడతేర్చిన కిరాతకం! అనుమానం అనే పెనుభూతం ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకోగా ఆ దారుణ హత్యకు పాల్పడిన భర్తకు న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. 2018లో గండిపేటలో సంచలనం సృష్టించిన ఈ హత్య కేసులో ఎనిమిదేళ్ల తర్వాత నిందితుడికి శిక్ష ఖరారైంది.భార్యపై అనుమానంతోనే దారుణం సైబరాబాద్ పోలీసుల వివరాల ప్రకారం. రంగారెడ్డి జిల్లా గండిపేటలోని వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన మహమ్మద్ గౌస్ పాషా (44) హౌస్‌కీపింగ్ ఉద్యోగిగా పనిచేసేవాడు. అతడికి భార్య షాహీన్ బేగంతో తరచూ గొడవలు జరిగేవి. తన భార్యకు వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో ఆమెతో నిత్యం ఘర్షణ పడేవాడు.ఈ క్రమంలో 2018 ఏప్రిల్ 24వ తేదీ రాత్రి భార్య నిద్రిస్తున్న సమయంలో ఆమె నోటిని టవల్‌తో మూసి, కత్తితో గొంతు కోసి హత్య చేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఈ ఘటనతో గండిపేట ప్రాంతంలో తీవ్ర కలకలం రేగింది. హత్య అనంతరం కేసు నమోదు చేసిన నార్సింగి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

**నిందితుడికి జీవిత ఖైదు**

ఈ కేసుపై విచారణ జరిపిన రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని పదో అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి బీ. అపర్ణాదేవి నిందితుడు మహమ్మద్ గౌస్ పాషాను దోషిగా నిర్ధారించారు. భారతీయ శిక్షాస్మృతి సెక్షన్ 302 కింద యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.20,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. అనుమానం పేరుతో జీవిత భాగస్వామి ప్రాణాలను బలితీసుకున్న ఘటనలో న్యాయస్థానం ఇచ్చిన ఈ తీర్పు ప్రాధాన్యం సంతరించుకుంది. భార్యాభర్తల మధ్య విభేదాలు, అనుమానాలు ప్రాణాంతక దాడులకు దారితీయకుండా సమస్యలను చట్టబద్ధంగా, శాంతియుతంగా పరిష్కరించుకోవాల్సిన అవసరాన్ని ఈ ఘటన గుర్తుచేస్తోంది.

## మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో వృద్ధుడికి జీవిత ఖైదు!

**నిందితుడికి పలు సెక్షన్ల కింద శిక్షలు.. బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం**

**జీడిమెట్ల కేసులో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు కీలక తీర్పు**



శేరిలింగంపల్లి : అక్టోబర్ 23,(ప్రభాత ఉదయం) మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో 65 ఏళ్ల వృద్ధుడికి న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. బాలికపై అత్యాచారం, బెదిరింపులకు పాల్పడినట్లు నమోదైన కేసులో నిందితుడు సయ్యద్ గౌస్‌కు పలు సెక్షన్ల కింద శిక్షలు విధిస్తూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పోక్సో కేసుల ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక న్యాయస్థానం తీర్పు వెలువరించింది. బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని కూడా కోర్టు ఆదేశించింది. వివరాల్లోకి వెళితే బోరబండ, చింతల్ ప్రాంతం గాంధీనగర్ నందన్‌నగర్‌కు చెందిన సయ్యద్ గౌస్ (65) వృత్తిరీత్యా వెల్డర్‌గా పనిచేసేవాడు. ఈ కేసు జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో 2015లో క్రైమ్ నమోదైంది. నిందితుడిపై అత్యాచారం, బెదిరింపులకు సంబంధించిన ఐపీసీ సెక్షన్లతో పాటు పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేశారు. విచారణ చేపట్టిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక న్యాయస్థానం నిందితుడికి జీవిత ఖైదుతో పాటు ఒక్కో సెక్షన్‌కు రూ.2,000 జరిమానా విధించింది. ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ.500 జరిమానా విధించింది. పోక్సో చట్టంలోని సెక్షన్ 3తో పాటు సెక్షన్ 4 కింద ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.1,000 జరిమానా విధించింది. అలాగే సెక్షన్ 5(ఎ)(అఅ)తో పాటు సెక్షన్ 6 కింద జీవిత ఖైదు, రూ.2,000 జరిమానా విధించినట్లు పోలీసులు పేర్కొన్నారు. బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని న్యాయస్థానం ఆదేశించింది. ఈ కేసును జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎ. చంద్రశేఖర్ దర్యాప్తు చేయగా, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి. ప్రభాకర్‌రెడ్డి న్యాయస్థానంలో ప్రాసిక్యూషన్ తరఫున వాదనలు వినిపించారు. మైనర్లపై లైంగిక నేరాలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన శిక్షలు తప్పవన్న విషయాన్ని ఈ తీర్పు మరోసారి స్పష్టం చేసింది.



## అక్రమ నిర్మాణాలను ఉపేక్షించేది లేదు

**హెచ్ఎండిఎ అధికారుల హెచ్చరిక**

**బొల్లారం గాంధీనగర్ లో హెచ్ఎండిఎ అధికారుల పర్యటన**

**సర్వే నిర్వహించి భూములను స్వాధీనం చేసుకుంటాం**

**పటాన్ చెరు, అక్టోబర్ 23( ప్రభాత ఉదయం):**

హెచ్ఎండిఎ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. బొల్లారం డివిజన్ పరిధిలోని గాంధీ నగర్ లో శుక్రవారం హెచ్ఎండిఎ అధికారులు పర్యటించారు. హెచ్ఎండిఎ పరిధిలో ఉన్న భూముల్లో చేపట్టిన నిర్మాణాలను పరిశీలించారు. అనుమతులు లేకుండా స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం, నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న తీరుపై ఉన్నతాధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎవరి సిఫారసులు మేరకు నిర్మాణాలు చేపట్టినా ఉపేక్షించేది లేదని వారు హెచ్చరించారు. గత కొన్ని నెలలుగా పత్రికలలో వచ్చిన, వస్తున్న వార్తల నేపథ్యంలో ఈ ప్రాంతాన్ని పరిశీలించినట్లు అధికారులు తెలిపారు. వివిధ శాఖల అధికారుల సమన్వయంతో ఈ ప్రాంతంలో సర్వే నిర్వహించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. హెచ్ఎండిఎ అధికారులు సుబ్రహ్మణ్యేశ్వరరావు, దివ్య రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ఈ ప్రాంతాన్ని పరిశీలించారు.



## విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరు కావాలి

**వెనకబడ్డ సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి సారించాలి.**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.**

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 23 ( ప్రభాత ఉదయం)**

విద్యార్థులు చదువులో రాణించేందుకు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. దసరా సెలవులు పూర్తయినందున విద్యార్థులు తప్పకుండా యూనిఫార్మ్ వేసుకొని పాఠశాలకు రావాలని సూచించారు. విద్యార్థులు పాఠశాలకు తక్కువగా రావడంతో తల్లిదండ్రులకి ఫోన్ చేసి విద్యార్థులు పాఠశాలకు వచ్చేలా అవగాహన కలిగించాలన్నారు. విద్యార్థులు దసరా సెలవులను ఎలా గడిపారో అడిగారు. సెలవులకు మందు ఇచ్చిన అసైన్మెంట్స్ ను పూర్తిచేసి ఉపాధ్యాయులకు ఇవ్వాలని సూచించారు. వెనుకబడ్డ సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. పాఠశాలలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల గురించి మాట్లాడారు. దాతల సహకారంతో నిర్మించిన స్టేజి షెడ్ ను పరిశీలించారు. పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణాన్ని పరిశీలించి విద్యార్థుల సంఖ్య ఆధారంగా తగినన్ని మరుగుదొడ్ల నిర్మాణానికి సహకరిస్తామన్నారు. దసరా సెలవులు పూర్తయినందున జిల్లాలోని అన్ని విద్యాసంస్థల విద్యార్థులు తమ పాఠశాలలకు తప్పనిసరిగా హాజరుకావాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ పర్యటనలో గద్వాల మండల విద్యాధికారి శ్రీనివాస్ గౌడ్, గద్వాల తహసిల్దార్ హరికృష్ణ, పాఠశాల జిహెచ్ఎం రేణుకా దేవి, తదితరులున్నారు.




## జూరాల ప్రాజెక్టు ఎడమ కాలువలో ప్రమాదవశాత్తు జారిపడి వ్యక్తి మృతి

**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 23(ప్రభాత ఉదయం):**

జూరాల ప్రాజెక్టు ఎడమ కాలువలో ప్రమాదవశాత్తు కాలు జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం అమరచింత పోలీస్ స్టేషన్ లో చోటు చేసుకుంది. ఏపి రాష్ట్రం అనంతపురం జిల్లాకు చెందిన శ్యామ్ (38) కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం జూరాల ప్రాజెక్టు పర్యటనకు వచ్చారు. ఈ క్రమంలో శ్యామ్ జూరాల ఎడమ కాలువ వద్ద ప్రమాదవశాత్తు జారి కాలువలో పడాడు.. స్థానికులు గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని బయటకు తీశారు.. ఈ ఘటనపై అమరచింత పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుచేస్తున్నారు. అయితే గద్వాలకు చెందిన కీర్తనతో అనంతరపురంకు చెందిన శ్యామ్ తో వివాహం జరిగిందని, వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్,



**గంజాయి తో పాటు మారణాయుధాలు స్వాధీనం**

**బుద్వేల్, అక్టోబరు 23 (ప్రభాత ఉదయం)**

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి ఇంటిపై దాడులు నిర్వహిం చిన ఎక్సైజ్ పోలీసులు అతన్ని అరెస్ట్ చేసి అతని నుంచి 1.5 కిలోల ఎండు గంజాయి తో పాటు, 113 కిలోల పాప్పి స్ట్రా హుస్క ( గసగసాల చెట్టు పువ్వులు, బెరెడు), ఒక రివాల్వర్, రెండు పిస్టల్లు, ఐదు రౌండ్ల బుల్లెట్లను శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఉప్పర్పల్లి లో గల రాజేంద్రనగర్ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పోలీస్ స్టేషన్ లో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గ్రేటర్ హైదరాబాద్ ఎక్సైజ్ విభాగం డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎ. శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. అత్తాపూర్ సిక్ చావుని లో నివాసం ఉండే సర్దార్ రాజా సింగ్ (39) నివాసం ఉండే 6-98-1/ఎ ఇంటి నెంబరు గల ఇంటిపై దాడులు చేయగా, ఎండు గంజాయి, పాప్పి స్ట్రా, రివాల్వర్, రెండు పిస్టల్లు, ఐదు రౌండ్ల బుల్లెట్లు లభ్యమయ్యాయన్నారు. స్వాధీనం చేసుకున్న వస్తువుల విలువ రూ. 4లక్షలు గా ఉం టుందన్నారు. గంజాయి ని మంగళహాట్ కు చెందిన రాహుల్ సింగ్ నుంచి, పాప్పి స్ట్రాను నాందేడ్ లో కొనుగోలు చేసినట్లు సర్దార్ రాజా సింగ్ ఒప్పుకున్నాడన్నారు. రివాల్వర్, పిస్టల్ ను ఎక్కడ కొనుగోలు చేశాడో తెలుపలేదన్నారు. నిందితుడు రికవరి ఏజెంట్ గా పనిచేస్తు గంజాయి ని విక్రయిస్తున్నట్లు తమ విచారణ లో తేలిందన్నారు. ఈ దాడులలో రాజేంద్రనగర్ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఇన్స్ పెక్టర్ నజీర్ పాషా, దూల్ పేట్ ఇన్స్ పెక్టర్ ప్రవీణ్ కుమార్, విప్లవ్ రెడ్డి, వెంకన్న, నీ విజయ్, సిబ్బంది జనార్దన్, ప్రసాద్ రావు, సాబీర్, నాగరాజు, సూర్య, రాజేశ్, లేఖ సింగ్, శ్రీను లు పాల్గొన్నారు.

## దర్యాప్తులో నిర్లక్ష్యం సహించేది లేదు!

**సీసీటీఎన్ఎస్ అప్‌డేట్స్ నుంచి నూతన క్రిమినల్ చట్టాల అమలు వరకు సీపీ డా. ఎం. రమేశ్ సమీక్ష**

**శేరిలింగంపల్లి : అక్టోబర్ 23, (ప్రభాత ఉదయం)**






నేరాల దర్యాప్తులో ప్రతి నిమిషం కీలకమే.. ప్రతి ఆధారం విలువైనదే.. ప్రతి కేసులో చట్టబద్ధమైన గడువు అత్యంత ముఖ్యమే! బాధితులకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యంగా సైబరాబాద్ పోలీస్ యంత్రాంగం దర్యాప్తు ప్రక్రియలను మరింత వేగవంతం చేయాలని పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేశ్ స్పష్టం చేశారు. సీసీటీఎన్ఎస్‌లో కేసుల వివరాల నమోదు నుంచి ఈ-సాక్ష్య వినియోగం వరకు, నూతన క్రిమినల్ చట్టాల అమలు నుంచి దర్యాప్తు గడువుల పాటింపు వరకు ప్రతి అంశంపై అధికారులను అప్రమత్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యానికి తావివ్వకుండా, ప్రతి కేసును నిర్దేశిత విధివిధానాల ప్రకారం ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు.సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అన్ని జోన్ల డీసీపీలు, అదనపు డీసీపీలు, ఏసీపీలు, పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు, ఇతర విభాగాల అధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్షా సమావేశంలో సీపీ కీలక సూచనలు చేశారు. సీసీటీఎన్ఎస్ అప్‌డేట్స్ పురోగతి, నూతన క్రిమినల్ చట్టాల అమలు తీరును సమీక్షిస్తూ దర్యాప్తులో నాణ్యత, పారదర్శకత, నిష్పక్షపాత ధోరణి, సమయపాలనకు పెద్దపీట వేయాలని ఆదేశించారు.

**ఈ-సాక్ష్యతో ఆధారాల భద్రత**

నేర పరిశోధనల్లో ఎలక్ట్రానిక్ ఆధారాల సేకరణ, నమోదు, భద్రతకు ఈ-సాక్ష్య యాప్‌ను సమర్థవంతంగా వినియోగించాలని సీపీ సూచించారు. నిర్దేశిత విధివిధానాలను కచ్చితంగా పాటిస్తూ, సాంకేతిక ఆధారాల నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. కేసులకు సంబంధించిన వివరాలు, దర్యాప్తు పురోగతి, ఇతర కీలక సమాచారాన్ని సీసీటీఎన్ఎస్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు.

**గడువులు దాటితే దర్యాప్తుపై ప్రభావం!**

కేసుల్లో చట్టం నిర్దేశించిన 60, 90 రోజుల గడువులను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సీపీ సూచించారు. దర్యాప్తును నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయడంతో పాటు, అవసరమైన నివేదికలను సకాలంలో సమర్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎఫ్ఐఆర్‌ల వివరాల నమోదులో జాప్యం లేకుండా చూడాలని, జీరో ఎఫ్ఐఆర్‌ల నమోదు, బదిలీ, తదుపరి విచారణ ప్రక్రియలను చట్టబద్ధంగా, వేగంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

**రోజువారీ పర్యవేక్షణ తప్పనిసరి**

ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఎస్‌హెచ్‌ఓలు, ఏసీపీలు దర్యాప్తుల పురోగతి, సీసీటీఎన్ఎస్ అప్‌డేట్స్, ఈ-సాక్ష్య వినియోగం, చట్టబద్ధమైన గడువుల పాటింపును ప్రతిరోజూ సమీక్షించాలని సీపీ ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న లోపాలను తక్షణమే సరిదిద్దాలని, దర్యాప్తులో జాప్యానికి కారణాలను గుర్తించి పరిష్కరించాలని సూచించారు. అమలు పురోగతిపై ఉన్నతాధికారులకు రోజువారీ నివేదికలు అందించాలని స్పష్టం చేశారు. నూతన క్రిమినల్ చట్టాల సమర్థవంతమైన అమలు, డిజిటల్ రికార్డుల ఖచ్చితమైన నిర్వహణ, నిర్ణీత గడువుల్లో దర్యాప్తుల పూర్తి విషయంలో ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సీపీ పునరుద్ఘాటించారు. సమీక్షలో జారీ చేసిన ఆదేశాలను కచ్చితంగా అమలు చేస్తూ, నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులకు స్పష్టం చేశారు.

# సస్పెన్షన్ ఎత్తివేత.. కాంగ్రెస్‌లో నా ప్రయాణం కొనసాగుతుంది

## పార్టీ సిద్ధాంతాలు, కార్యకర్తలే నా బలం.. కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తా: శేరి సతీష్ రెడ్డి

**కూకట్‌పల్లి, అక్టోబర్ 23 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) తనపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయడంతో కాంగ్రెస్ పార్టీలో తన రాజకీయ ప్రయాణం తిరిగి కొనసాగించనున్నట్లు కూకట్‌పల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి తెలిపారు. తన వివరణను పరిశీలించిన పార్టీ క్రమశిక్షణ చర్యల కమిటీ సస్పెన్షన్‌ను అధికారికంగా ఎత్తివేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీపీసీసీ నాయకత్వానికి, క్రమశిక్షణ చర్యల కమిటీ చైర్మన్, పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవికి, కమిటీ వైస్ చైర్మన్ శ్యామ్ మోహన్ అనంతులకు, జిల్లా కాంగ్రెస్ కమిటీ నాయకత్వానికి శేరి సతీష్ రెడ్డి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



**పదవుల కంటే పార్టీ నిబద్ధతే ముఖ్యం**

కాంగ్రెస్ పార్టీ తన రాజకీయ ప్రస్థానానికి పునాది అని, ఎన్ని ఆటంకాలు ఎదురైనా పార్టీ సిద్ధాంతాలను, కార్యకర్తలను వీడకుండా ముందుకు సాగుతానని ఆయన స్పష్టం చేశారు. పదవులు శాశ్వతం కాదని, పార్టీ పట్ల నిబద్ధత, విశ్వాసం, క్రమశిక్షణే శాశ్వతమని పేర్కొన్నారు. తనపై విశ్వాసం ఉంచి, కష్టకాలంలో అండగా నిలిచిన కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు, శ్రేయోభిలాషులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

**పార్టీ బలోపేతమే ప్రధాన లక్ష్యం**

తనకు పదవులు ముఖ్యం కాదని, కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే ప్రధాన లక్ష్యమని శేరి సతీష్ రెడ్డి పేర్కొన్నారు. అధికారం కంటే కాంగ్రెస్ కార్యకర్తల అభిమానం తనకు గొప్ప బలమని, వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా పార్టీ భవిష్యత్తు కోసం పనిచేస్తానని తెలిపారు. పార్టీ క్రమశిక్షణను గౌరవిస్తూ, స్థానిక నాయకత్వంతో పాటు జిల్లా కాంగ్రెస్ కమిటీతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. సస్పెన్షన్ ఎత్తివేతతో తన రాజకీయ ప్రయాణంలో మరో ముఖ్యమైన ఘట్టం ప్రారంభమైందని పేర్కొన్న శేరి సతీష్ రెడ్డి, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి కాంగ్రెస్ అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తానని వెల్లడించారు.

# గద్వాల కలెక్టరేట్ ఎదుట మృతుడి కుటుంబం ధర్నా..

### ఆత్మహత్యాయత్నం భగ్నం

### మద్దెలబండ తండా హత్య కేసులో సత్వర న్యాయం చేయాలని డిమాండ్

### హంతకుల నుంచి ప్రాణహాని ఉందని చంద్రునాయక్ కుటుంబం ఆవేదన

### జిల్లా ఎస్పీకి వినతిపత్రం అందజేత

**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 23(ప్రభాత ఉదయం):**

భూ వివాదం నేపథ్యంలో దారుణ హత్యకు గురైన మల్దకల్ మండలం మద్దెలబండ పెద్ద తండా వాసి చంద్రునాయక్ (45) కుటుంబ సభ్యులు తనకు న్యాయం చేయాలంటూ రోడ్డెక్కారు. తమకు తక్షణ రక్షణ కల్పించాలని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట చంద్రునాయక్ భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు మరియు బంధువులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించగా, అప్రమత్తమైన పోలీసులు వెంటనే స్పందించి వారిని అడ్డుకున్నారు.



**గ్రామం వీడినా వీడని భయం..**

గత మే 2వ తేదీన మద్దెలబండ పెద్ద తండాలో భూ తగాదాల కారణంగా చంద్రునాయక్‌ను ఆయన దాయాదులే కిరాతకంగా హత్య చేశారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ కేసులో పోలీసులు కొందరిని విచారించి ముగ్గురు ప్రధాన నిందితులను రిమాండ్‌కు తరలించినప్పటికీ, మిగతా నిందితుల నుంచి ప్రాణహాని ఉందన్న భయంతో మృతుడి కుటుంబం ఊరు విడిచి హైదరాబాద్‌లో తలదాచుకుంటోంది. ఇటీవల దసరా పండుగ సందర్భంగా స్వగ్రామానికి వచ్చిన చంద్రునాయక్ కుటుంబంపై ప్రత్యర్థులు మరోసారి దాడికి పాల్పడటంతో పోలీసులు కేసులు కూడా నమోదు చేశారు.

**పోలీసుల తీరుపై బాధితుల ఆగ్రహం..**

తమ తండ్రిని హత్య చేసిన వ్యక్తుల నుంచి తమకు రక్షణ కల్పించాల్సిన బాధ్యతలో ఉన్న మల్దకల్ పోలీసులు నిందితులకు కొమ్ముకాస్తున్నారని మృతుడి పిల్లలు ఆరోపణలు చేశారు. న్యాయం జరగకపోతే కలెక్టరేట్ ముందే ప్రాణాలు తీసుకుంటామని హెచ్చరిస్తూ ఆందోళనకు దిగారు. పోలీసులు వారిని శాంతింపజేసి, అనంతరం చంద్రునాయక్ కుటుంబ సభ్యులను జిల్లా ఎస్పీ ఎదుట హాజరుపరిచారు. బాధితులు తమ గోడును ఎస్పీకి వెళ్లబోసుకుని, తమ కుటుంబానికి ప్రాణ రక్షణ కల్పించాలని వినతిపత్రం అందజేశారు.

# మార్పు మనతోనే మొదలవ్వాలి.. మనమే అందరికీ ఆదర్శంగా నిలవాలి:

### నీరు, విద్యుత్ పొదుపుపై జలమండలి ఎండీ కె. అశోక్ రెడ్డి పిలుపు

### జలమండలి కార్యాలయాల్లో 20 శాతం నీరు, విద్యుత్ పొదుపు తప్పనిసరి

### ఏసీల ఉష్ణోగ్రత 25 డిగ్రీల సెల్సియస్ వద్దే ఉంచాలి

### సాయంత్రం 5 గంటల తర్వాత ఏసీల వినియోగం నిలిపివేయాలి

### ఏసీల నుంచి వెలువడే నీటిని సేకరించి పునర్వినియోగించాలి

### నీటి లీకేజీలను వెంటనే అరికట్టాలి.. అనవసర విద్యుత్ వినియోగాన్ని నియంత్రించాలి

### పొదుపు చర్యల అమలుపై అధికారులదే బాధ్యత.. నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

**హైదరాబాద్, అక్టోబర్ 23(ప్రభాత ఉదయం)**



"మార్పు మనతోనే మొదలవ్వాలి.. మనమే అందరికీ ఆదర్శంగా నిలవాలి. నీటిని పొదుపుగా వినియోగించాలని ప్రజలకు చెప్పే ముందు మనమే ఆచరించి చూపాలి" అని జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి స్పష్టం చేశారు. జలమండలి పరిధిలోని అన్ని కార్యాలయాల్లో నీరు, విద్యుత్ వినియోగాన్ని కనీసం 20 శాతం తగ్గించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రానున్న ఎల్-నినో పరిస్థితుల నేపథ్యంలో నీటి వనరుల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉ ఒదన్నారు. నీటి పొదుపును ప్రజా ఉద్యమంగా మార్చాలంటే ముందుగా జలమండలి కార్యాలయాల్లోనే ఆచరణలో పెట్టాలని సూచించారు. ఈ మేరకు అన్ని కార్యాలయాల్లో నీరు, విద్యుత్ పొదుపునకు సంబంధించి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

**ఏసీల వినియోగంపై ప్రత్యేక నియంత్రణ:**

అన్ని కార్యాలయాల్లో ఎయిర్ కండిషనర్ల ఉష్ణోగ్రతను తప్పనిసరిగా 25 డిగ్రీల సెల్సియస్ వద్ద ఉంచాలని ఎండీ ఆదేశించారు. సాయంత్రం 5 గంటల తర్వాత ఏసీల వినియోగాన్ని నిలిపివేయాలని స్పష్టం చేశారు. అత్యవసర నిర్వహణ అవసరాల కోసం సంబంధిత ఉన్నతాధికారుల ప్రత్యేక అనుమతి ఉన్న సందర్భాల్లో మాత్రమే మినహాయింపు ఉంటుందని పేర్కొన్నారు.

**ఏసీల నుంచి వెలువడే నీటిని వృథాగా పోనివ్వకుండా సేకరించి, మొక్కల పెంపకం, శుభ్రత, ఇతర తాగునీరు అవసరం లేని పనులకు పునర్వినియోగించాలని సూచించారు.**

నీటి లీకేజీలకు తక్షణమే అడ్డుకట్ట:

కార్యాలయ భవనాలు, మరుగుదొడ్లు, పైప్‌లైన్లు, నల్లాలు, నీటి నిల్వ ట్యాంకులు, ఇతర ప్రాంతాల్లో లీకేజీలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నీరు వృథా కాకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.

**పొదుపు మన నుంచే ప్రారంభం కావాలి:**

నీటి పొదుపు కేవలం ప్రచార కార్యక్రమంగా మిగిలిపోకూడదని, జలమండలి వ్యవస్థలోనే ఆచరణలో కనిపించాలని ఎండీ పేర్కొన్నారు. ప్రతి అధికారి, ఉద్యోగి నీరు, విద్యుత్ సంరక్షణను వ్యక్తిగత బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. చిన్నచిన్న పొదుపు చర్యలను ప్రతి ఉద్యోగి నిత్య అలవాటుగా మార్చుకుంటే గణనీయమైన నీరు, విద్యుత్ ఆదా సాధించవచ్చన్నారు. అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి 20 శాతం పొదుపు లక్ష్యాన్ని సాధించాలని ఆదేశించారు. మనం మారకుండా సమాజాన్ని మార్చలేం.. మనం ఆచరించకుండా ఇతరులకు చెప్పలేం. అందుకే నీరు, విద్యుత్ పొదుపులో మార్పు ముందుగా మన కార్యాలయాల నుంచే ప్రారంభం కావాలి.. అని ఎండీ అశోక్ రెడ్డి పేర్కొన్నారు.

**పొదుపులో ముందున్న వారికి ప్రశంసాపత్రాలు:**

నీరు, విద్యుత్ పొదుపు చర్యలను సమర్థవంతంగా అమలు చేసి, నిర్దేశించిన 20 శాతం లక్ష్యాన్ని సాధించిన కార్యాలయాలను గుర్తించి ప్రోత్సహిస్తామని ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు. ప్రతి నెలా నీరు, విద్యుత్ సంరక్షణలో ఉత్తమ పనితీరు కనబరిచిన అధికారులు, సిబ్బందికి ప్రత్యేక ప్రశంసాపత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు. పొదుపు చర్యల అమలులో ఆరోగ్యకరమైన పోటీని ప్రోత్సహించి, ప్రతి జలమండలి కార్యాలయం ఇతరులకు ఆదర్శంగా నిలిచేలా కృషి చేయాలని సూచించారు.



# గ్రామాల రీసర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

### లైసెన్స్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలి.

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 23 (ప్రభాత ఉదయం)**

జిల్లాలోని గ్రామాల భూముల రీసర్వే ప్రక్రియను కచ్చితత్వంతో, పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సర్వే అధికారులను ఆదేశించారు. శుక్రవారం గద్వాల మండలం సంగాల గ్రామపంచాయతీకి సంబంధించిన రీసర్వే పనుల పురోగతిని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. రీసర్వేలో భాగంగా ముందుగా గ్రామ సరిహద్దులను కచ్చితంగా గుర్తించి డీమార్కేషన్ చేయాలని సూచించారు. సరిహద్దుల నిర్ధారణకు అందుబాటులో ఉన్న పాత రికార్డులతో పాటు క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించాలని తెలిపారు. అనంతరం సర్వే నంబర్ల వారీగా భూములను గుర్తించి పార్సిళ్లుగా రూపొందించాలన్నారు. ప్రభుత్వ భూములు, రహదారులు, గ్రామకంఠం, అసైన్డ్ భూములు, చెరువులు, కుంటలు, గట్లు, తదితరాలను ప్రత్యేకంగా గుర్తించి రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు. సంబంధిత రెవెన్యూ రికార్డులను ఆధారంగా తీసుకుని క్షేత్రస్థాయిలో భౌతిక పరిస్థితులతో సరిపోల్చాలని సూచించారు. రీసర్వేలో రోవర్, జీపీఎస్, తదితర సాంకేతిక పరికరాలను సక్రమంగా వినియోగించాలని తెలిపారు. సర్వే సమయంలో ప్రతి పాయింట్‌కు సంబంధించిన భౌగోళిక వివరాలు కచ్చితంగా నమోదు అయ్యేలా చూడాలన్నారు. పాయింట్లను నమోదు చేసే సమయంలో అవసరమైన సమయం తీసుకుని సిగ్నల్ స్థిరంగా వచ్చిన తర్వాతే తుది పాయింట్‌ను నిర్ధారించాలన్నారు. గ్రామంలో ప్రైవేట్ భూముల సర్వే చేపట్టే తేదీని ముందుగానే సంబంధిత రైతులకు తెలియజేయాలని సూచించారు. సంబంధిత రైతులు తమ పొలాల వద్ద అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతుల సహకారంతో సర్వే పనులను వేగంగా, వివాదాలకు తావులేకుండా పూర్తి చేయవచ్చన్నారు. రికార్డుల్లో ఉన్న వ్యక్తి, క్షేత్రస్థాయిలో భూమిని అనుభవిస్తున్న వ్యక్తి వేర్వేరుగా ఉన్న సందర్భాల్లో నిబంధనల ప్రకారం సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేయాలని సూచించారు. వారికి తమ ఆధారాలు, అభ్యంతరాలు సమర్పించేందుకు అవకాశం కల్పించి, నిర్ణీత గడువులోగా వాటిని పరిశీలించాలని తెలిపారు. జిల్లాలో ఇప్పటికే జీపీఎస్, సర్వే తదితర అంశాల్లో శిక్షణ పొందిన లైసెన్స్ సర్వేయర్లు అందుబాటులో ఉన్నందున వారిని రీసర్వే పనుల్లో సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. కేటాయించిన సిబ్బంది పనిలో పూర్తిస్థాయిలో పాల్గొనేలా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఈ పర్యటనలో సర్వే ఏడి నూకరాజు, తహసిల్దార్ హరికృష్ణ, డిప్యూటీ తహసిల్దార్ అజిత్, ఆర్ఐ వెంకటేశ్వర్ రెడ్డి, మండల సర్వేయర్ సందీప్, పలువురు గ్రామస్తులు, తదితరులున్నారు.



# శక్తి నగర్‌లో 15 ఏళ్ల రహదారి సమస్యకు తాత్కాలిక పరిష్కారం!

### వడ్డేపల్లి రాజేశ్వరరావు చొరవతో మట్టి రోడ్డు నిర్మాణం.. స్థానికులకు ఊరట

**కూకట్ పల్లి; అక్టోబర్ 23 (ప్రభాత ఉదయం)**

కూకట్‌పల్లి నియోజకవర్గం ఖైతలాపూర్ డివిజన్ పరిధిలోని శక్తి నగర్‌లో గత 15 ఏళ్లుగా రహదారి సౌకర్యం లేక స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు ఎట్టకేలకు తాత్కాలిక పరిష్కారం లభించింది. వైట్ వాటర్ అపార్ట్‌మెంట్స్ సమీపంలో రహదారి నిర్మాణానికి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు చొరవ తీసుకోవడంతో మట్టి రోడ్డు నిర్మాణం పూర్తయింది. దీంతో ఎన్నో ఏళ్లుగా రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న కాలనీ ప్రజలకు కొంత ఉపశమనం లభించింది. గత వారం స్థానిక డివిజన్ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు, రహదారి నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి, తాత్కాలికంగా మట్టి రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు తనవంతు సహకారం అందించారు. ఈ క్రమంలో నిర్మాణ పనులు పూర్తికావడంతో నూతనంగా ఏర్పాటుచేసిన రహదారిని వడ్డేపల్లి రాజేశ్వరరావు, డివిజన్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రారంభించారు.

**15 ఏళ్ల నిరీక్షణకు తాత్కాలిక ఉపశమనం**

శక్తి నగర్‌లోని వైట్ వాటర్ అపార్ట్‌మెంట్స్ సమీపంలో సరైన రహదారి లేకపోవడంతో స్థానికులు చాలాకాలంగా రాకపోకల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం చేపట్టిన ప్రయత్నాల్లో భాగంగా తాత్కాలికంగా మట్టి రోడ్డు నిర్మించడం ద్వారా ప్రజలకు కనీస రవాణా సౌకర్యం కల్పించారు. రహదారి అందుబాటులోకి రావడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. కాలనీ అభివృద్ధికి భవిష్యత్తులోనూ సహకరిస్తామని, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న నాయకులకు తమ మద్దతు ఉంటుందని స్థానికులు పేర్కొన్నారు.

**ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం**

ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం అందరి బాధ్యత అని అన్నారు. గత 15 ఏళ్లుగా రహదారి సౌకర్యం లేక స్థానికులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి, అందుబాటులో ఉన్న మార్గాల ద్వారా తాత్కాలికంగా మట్టి రోడ్డు నిర్మాణానికి సహకరించినట్లు తెలిపారు. ప్రజలకు కనీస రవాణా సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈ ప్రయత్నం చేపట్టామని వివరించారు. శక్తి నగర్ కాలనీ అభివృద్ధికి అవసరమైన సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని, ప్రజా సమస్యలపై ఎల్లప్పుడూ స్పందిస్తామని ఆయన స్పష్టం చేశారు. రహదారి నిర్మాణానికి కృషి చేసిన డివిజన్ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, ఇతర నాయకులను అభినందించారు. రాబోయే రోజుల్లో కూకట్‌పల్లి లో భారతీయ జనతా పార్టీ పతాకాన్ని ఎగురవేస్తామని ఆయన పేర్కొన్నారు. పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు డివిజన్ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా మోర్చా నాయకురాలు విజయ భవాని, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి యంజల పద్మయ్య, ఇతర వెనుకబడిన తరగతుల విభాగం జిల్లా అధికార ప్రతినిధి కోడిచెర్ల వినోద్, భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు తూము శైలేష్, ఐలయ్య, జీవన్, శేఖర్ గుప్తా, పిట్ల మనోహర్, ఈ. సాయి, స్థానిక డివిజన్ నాయకులు రాజేందర్ గౌడ్ (బబ్లు), మనోజ్, శ్రీనివాస్ చారి, కృష్ణ యాదవ్, చక్రవర్తి, వంశీ నేతతో పాటు పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.



# మండల సమావేశానికి భార్యల స్థానంలో భర్తలు

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 23 ( ప్రభాత ఉదయం)**

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలనే ఉద్దేశంతో కల్పించిన హక్కులు ఆదిలోనే నీరుగారిపోతున్నాయి. కేటిదొడ్డి మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన సమావేశం ఇందుకు ఉదాహరణగా మారింది. రైతు వేధిక కార్యాలయంలో 'ఎల్‌నినో ప్రబావం రానున్న కాలంలో నీటిపొదుపుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు' అనేక అంశాలపై ఎంపీడీవో రమణరావు ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మండల సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు, ఏఈఓలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఏలు హాజరయ్యారు. అయితే మహిళా సర్పంచులకు బదులు వారి భర్తలు, కుమారులు, బంధువులు హాజకు కావడం చర్చనీయాంశంగా మారింది. సమావేశానికి దర్జాగా హాజరై చర్చల్లో పాల్గొనడం పట్ల ద్వితీయ శ్రేణి అధికారులు ముక్కున వేలేసుకుంటున్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608